# ఇసుకదిబ్బ

"బాబూరావు"




నాలుగున్నరౌతున్నది. మరో అరగంటైతే ఆఫీసునుండి విముక్తి లభిస్తుంది.

వైశాఖం ఎండలు మండిపోతున్నాయి. కిటికీల్లోంచి కనిపిస్తూన్న ఎండిపోయిన గుట్టలు ఎండమావుల ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నాయి. అంత ఎండలోనూ వంకర టింకరగా ఉన్న బాటగుండా ఇద్దరు ప్రయాణీకులు నడిచి పోతున్నారు. చప్పుడుచేస్తూ శక్తికొలంది తిరుగుతూ ఉన్న పంకాలు అస్బెస్టాస్ రేకుల్లోంచి వస్తూఉన్న వేడిని ఏమాత్రమూ తగ్గించలేకపోతున్నవి. ఎన్ని నీళ్ళు తాగినా, కొద్దిసేపట్లోనే మళ్ళీ నాలుక. పెదవులు, గొంతు ఎండిపోయి అర్చుకుపోతున్నాయి.

ఒకటే ఎండ, వేడి, తాపం —

—సరిగ్గా నాలుగున్నర, అప్పుడే ప్రైమరీహెల్త్ సెంటర్‌లో పనిచేసే చప్రాసి రాములు పరుగెత్తుకు వచ్చాడు వగరుస్తూ. శరీరం మీంచి చెమటలు కారుతూ బట్టలన్నీ తడిసిపోయి ఉన్నాయి. వచ్చీ రావడంతోనే—

'ఆమె విషంమందు తాగింది. డాక్టర్ దొర లేడు' జీబు కావాలె. పెద్ద దవాఖానాకు తీసుక పోతారట.' అనన్నాడు ఏకబిగిన, ఊపిరి పీల్చుకోకుండా.

మేమంతా కూర్చున్న సీట్లలోంచి ఒక్క దుముకులో వెళ్ళి రాములు చుట్టూ మూగాము.

'ఆమె ఎవరు?'

'విక్టోరియా.'

'ఏ విక్టోరియా!...ఏ విక్టోరియా?'

'ఆ...ఆ...ఆమే గ్రామ సేవిక.'

నిర్విణ్ణులమయి పోయాం మేము. మాలో ఎవరికీ నమ్మకం కలగలేదు. మా అనుభవాలు రాములు మాటలను నిజంగా ఒప్పుకోవడానికి నిరాకరించాయి. కాని నిజంలానే ఉంది. రాములుఅంతటి అబద్దం చెప్పడు.

నాలో రక్తం ఒక్కసారిగా ఆగిపోయి తిరిగి పారసాగింది. కాళ్ళు వణికాయి. మనసు వణికింది. హృదయం వణికింది. నరాలు డీలా పడిపోయాయి.

"నిజం చెప్పు" అని అరిచాను.

"నిజంగానే దొరా."

"ఇప్పుడెక్కడుంది ఆమె?"

'దావకాన్ల.'

పదిరోజుల క్రితం పెద్దగాలివాన వచ్చింది. అప్పుడు మేమంతా ఆఫీసులోనే ఉన్నాము. కిటికీలన్నీ మూసివేసుకుని, తలుపులు బిడాయించుకుని, ప్రాణాలరచేతుల్లో పట్టుకుని కూర్చున్నాము. గంటలో తగ్గిపోయింది గాలివాన. తలుపులు తెరచాము. ఆశ్చర్యం: ఊశలను దింపిన పెద్దమర్రి చెట్టు కూకటి వ్రేళ్ళతో సహా కూలిపోయింది. అది అలా కూలిపోతుందని మే మనుకోలేదు.

జరగవమకున్నవి జరుగుతాయి. జరుగుతాయనుకున్నవి జరగవు. అలా జరగడానికి. జరగకపోవడానికీ కూడ కారణాలు ఉంటాయి. ఆ కారణాలను తెలుసుకోనంతవరకు ఆశ్చర్యంగానే, ఊహాతీతంగానే కనిపిస్తుంది. కాని కారణాలను తెలుసుకోవడం అంత సులభం కాదు. అందరికి సాధ్యం కాదుకూడ.

మా స్టాఫంతా రాములును ఇంకా వివరాలు అడుగుతూనే ఉన్నారు. ఆతురతతో అడిగిన ప్రశ్నలే అడుగుతున్నారు. కంగారులో రాములు ఒకసారి ఒకవిధంగా, మరొకసారి మరొక విధంగా జవాబులు చెబుతున్నాడు.

ఒక్క అంగలో బి. డి వో గారి గదిలోకివెళ్లాను. విన్న విషయం చెప్పాను గబగబా.

బి డి వో గారు తెరచిన ఫైలు తెరచినట్లుగానే పక్కన పెట్టారు. కుర్చీకి తగిలించిన కోటు తొడుక్కోకుండానే బయటకు వచ్చేశారు, ఆయన్ని అనుసరించాను.

"ఎవరు చెప్పారు?"— ఆయనకు కూడా అనుమానం వచ్చినట్లుంది.

చెప్పాను, పిలవమన్నారు.

రాములును పిలుచుకు వెళ్ళేసరికి బి.డి. వో గారు జీబులో స్టీరింగ్‌ముందు కూర్చున్నాడు. ఆయన ప్రక్కన పి. ఏ. రామిరెడ్డి కూర్చున్నాడు. నేనూ, హ్యూనూ వెనకసీట్లో కూర్చున్నాము. జీబు బయలేరింది.

సమితి ఆఫీసు ఊరిబయట ఉంది. ప్రైమరీ హెల్తుసెంటర్ నట్టనడి ఊళ్ళో ఉంది. సమితి ఆఫీసు నుండి అక్కడికి మైలుపైగా దూరంవుంది.

జరిగింది విన్నాక బి. డి. వో గారు అడిగారు.

'ఆమె ఎందుకలా చేసిందో?'

రాములు చెప్పిం దిది.

'రాత్రి పెద్దలొల్లి జరిగింది. సర్పంచు రామన్న ఆమె ఇంటికి బోయి తలుపు కొట్టిండట. ఆమె తలుపు తియ్యలేదు. బాగా తాగున్నడో ఏమో— బూతులు తిట్టుకుంట తలుపులను తన్నుడు మొదలు పెట్టిండట. ఆమె ఉంటాన్న ఇల్లు గౌండ్ల నాయన్నది. ఆయన చిన్నకొడుకు నారాయణ పట్నంలో పెద్దసదువు సదువుతాండు. అతడొచ్చి సర్పంచ్ రామన్నను యెల్లిపొమ్మన్నడట. 'నువ్వెవనివిరా నన్ను పొమ్మనేతందుకు? నేను విక్టోరియా ఇంటి తలుపు కొడ్తాన్న. లావులావు అడ్డమిత్తాన్నవుగని. అది నీకేమైతది చెప్పు కొంచెం?' అనన్నడట రామన్న. నారాయణకొకోపంవచ్చి ఆయన మెడలుబట్టి నూకేశిండట. రెండుమూడు పరిశింటట గూడ. రామన్న బోయి తన మనుసులను తోలుకచ్చిండు. వీళ్ళు, వాళ్లు ఇష్ట కొట్టు

కున్నారు. సర్పంచు మనుషులు విక్టోరియా ఇంటి తలుపులు పగలగొట్టింద్రు. ఆమె దొరకలేదు. దొరికిన మంచం, కుర్చీలు అన్నీ ఇరిసి పారేసింద్రు. సామాన్లు పగలగొట్టింద్రు. బట్టలు చింపేసింద్రు. ఆ రాత్రంత నాయన్నింటోళ్లు ఆమెను తమ ఇంట్ల దాచింద్రట. తెల్లారినంక ఆమె బాగనే ఉన్నదట. కాని ఇంతసేపుముందు జరసేపటి కింద ఆమె రూములోనుంచి ఏడ్పినిపించి. ఇంటోళ్ళచ్చి చూసే తలికేమున్నది-మంచంల బడి ఏడ్పుకుంట కొట్టుకుంటాన్నదట. కింద సల్లులమందు డబ్బ ఉన్నదట. మొగోళ్ళు, ఆడోళ్లు అందరు కలిసి బలిపీటికి దావకాన్లకు గుంజుకచ్చింద్రు....

"పోయినేడు కూడ ఇట్లాగే జరిగింది సార్. వీఐవో సుబ్బారావు వీపుకు సున్నం రాసుకున్నడు దీనివల్లనే. ఛీ ఛీ - ఇటువంటి వాళ్ళంతా ఇంతే సార్... లంగలంజలు బరితెగించి ఉంటరు. చివరికి ఇట్లా దిక్కూ మొక్కూ లేని చావు చస్తరు"- పిపి రామిరెడ్డి అన్నాడు.

ఈ మాటలు వినలేక పోయాను నేను. ఆమె ఎంత చెడ్డదైనాగానీ, ఆమె గత చరిత్ర ఎంత విషపూరితమైనాగానీ ఇప్పుడు ఘోరంగా, దారుణంగా చావడానికి సిద్ధంగా ఉన్నది. కనీసం జాలి చూపకపోయినాసరే, పాపమని కన్నీరు కార్చకపోయినా సరే-పైగా అంత కఠినంగా, నీచంగాఎలా మాట్లాడగలిగాడో? ఆమె అలా తయారుకావడానికి, ఆత్మహత్యా ప్రయత్నం చేసుకోవడానికి తన లాంటివారే కారణం అని ఎలా మరిచి పోగలిగాడు? పెద్ద నీతిమంతుడులా ఆమెను అసహ్యించుకుంటూన్న ఈ దొరవారే ఒక రాత్రి బాగా తాగి, ఆమె ఇంటి తలుపు తట్టిన సంగతిని ఎలా మరచిపోగలిగాడో? అతని సంస్కారం గురించి, నీతి నియమాల గురించి నాకు బాగా తెలుసు, తెలిసి ఉన్నప్పుడు నోరు తెరచి వాదించి లాభం ఉండదు.

ఆపుకోలేనంత కోపం వచ్చింది నాకు. వెనక నుంచి రామిరెడ్డి కాలరు లాగి నాలుగు పుతికి జీబు లోంచి తోసేయాలన్నంత ఆవేశం పుట్టింది. బలవంతాన ఆపుకున్నాను.

బి. డి. ఓ. గారు కూడా అతని మాటలకు బాధపడ్డట్టున్నారు. ఆయనకు విక్టోరియాగురించి తెలియకున్నా రామిరెడ్డి గురించి బాగా తెలుసు.

మళ్ళీ ఏదో మాట్లాడాలని రామిరెడ్డి నోరుతెరచేసరికి బి. డి. ఓ. గారు అన్నారు.

'ఆమె ఆడది. అందుకైనా సింపథీ చూపించాలి'

రామిరెడ్డి మళ్ళీ నోరు తెరవలేదు.

మేము అక్కడికి వెళ్ళడానికి పదారు నిమిషాలు పట్టింది. వెళ్ళేసరికి ప్రైమరీ హెల్తుసెంటర్ లోపల, బయట ఆడ, మొగ, పిల్లలు, పెద్దలు- చాలామంది గుమిగూడి ఉన్నారు. బి. డి. ఓ. గారిని చూడగానే పక్కలకు తప్పుకుని దారి యిచ్చారు.

విక్టోరియా కుర్చీలో జారిగిలబడి ఉంది. తలఒకవైపుఒరిగిపోయివుంది. కళ్ళుమూసుకుని ఉన్నాయి. ఇదివరదాకా ఏడ్చిన గుర్తుగా కన్నీరు చెంపల మీద ఇంకా యింకిపోలేదు. చేతులు జీవరహితంగా వ్రేలాడుతున్నాయి. తెరచివున్న నోటినుండి ఆమె త్రాగిన ద్రావకం చొల్లుతో కలసి కారి, మెడమీదుగా జాకెట్టులో యింకిపోయింది. పెదవులు బాధను ఓర్చుకోలేకవిఫలమైనట్లు వల్లబడి వంకర తిరిగాయి. ముక్కు పుటాలు ఉబ్బిపోయి, శ్వాస బలహీనంగా, ఉండి ఉండి వస్తున్నది.

గులాబీపూలున్న వాయిల్ చీర కట్టుకుంది. అదే రకం జాకెట్టు తొడుక్కుంది. కాళ్ళకు చెప్పులు లేవు. ఎడం చేతికి వాచీ ఉంది. కుడిచేయి బోడిగా ఉంది. గోళ్ళకు రంగుపూసి ఉంది. మెడ ఖాళీగా, వెలితిగా ఉంది. పైట వక్షం మీంచి తొలగిపోయి కుర్చీ చేతిమీదుగా భూమిపై వ్రేలాడుతున్నది. నిగుడిపోయి వెంట్రుకలు చెల్లాచెదురై మొగాన్ని సగం దాకా కప్పేశాయి.

ఆమె వెనక దాయా రాజమ్మ నించుని, ఆమె రెండు భుజాలను పట్టుకుని ఏడుస్తున్నది. హెల్తు ఇనస్పెక్టరిద్దరు, నాయన్న కొడుకు నారాయణ ఒకవైపు, కాంపౌండరు, హెల్తు విజిటర్ సత్యవతి మరొకవైపు, ఉపాధ్యాయులు, పెద్దలు మొదలైన వారంతా ఆమెచుట్టూ మూగి ఉన్నారు. వాళ్ళలో సర్పంచ్ రామన్న లేడు.

బి. డి. వో. గారు వాళ్ళను తొలగించుకుని వెళ్ళి ఆమె పక్కన నించున్నారు.

'ఎంతసేపయింది?' అని బి.డి.వోగా రడిగారు.

---

## అ ప రా ధం

ఒక అపరాధం ఒక వ్యక్తిని
క్రుంగదీస్తుంది. అదే అపరాధం
మరోవ్యక్తిని స్వేచ్ఛగా
ముందుకు సాగిపోనిస్తుంది.
విధినిషేధాలన్నీ అందరిమీదా
ఒకేరకంగా పనిచెయ్యవు.

— శరత్ చంద్రుడు

---

'తెలియదు?' అన్నాడు కాంపౌండరు.

'మరి మీరేం చేస్తున్నారు? యాంటీ ఏదైనా ఉంటే తాగించలేకపోయారా?'

'యాంటీ ఏం లేవు'

'డాక్టరుగారెటు పోయారు?'

'పొద్దున్నే టూర్‌పోయినారు. రాత్రికి వస్తారు.'

బి.డి.వోగారు ఆమెపైకి వంగారు. రెండుచేతుల్తో ఆమె చెంపలను పట్టుకుని తలను నిదానంగా నించుండబెట్టి, 'విక్టోరియా, విక్టోరియా' అంటూ బిగ్గరగా పిలిచారు.

ఎంతో సేపటికి ఆమె మెల్లగా, భారంగా కళ్ళు తెరచింది. నరాల సత్తువను క్రోడీకరించుకుంటూ గుచ్చి గుచ్చి చూసింది బి.డి.వో.గారి కళ్ళలోకి. కొంచెం సేపటికి ఆయనను గుర్తించినట్లుగా 'మీరా?!' — అంది బలవంతంగా, నూతిలోంచి వచ్చినట్లుగా ఉన్నాయి ఆమె మాటలు.

ఆమె కళ్ళనుండి కన్నీరు కారసాగింది ధారాపాతంగా. దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చింది. ఏడుస్తూనే స్పష్టాస్పష్టంగా అంది.

'నా కెవరూ లేరు. ఈ ప్రపంచంలో నేనొంటరిని. ఈ పాడుబతుకు బతకలేను. అందుకని చచ్చిపోతున్నాను. నన్ను బతికించకండి. బతికించకండి. మీకు మొక్కుతా...'

చేతులు జోడించింది. ఏడుస్తూనే స్పృహ తప్పిపోయింది. జోడించినచేతులు వాలిపోయాయి. తల ఒరిగిపోయింది.

ఆమె నన్ను చూడలేదు. చూస్తే ఏంచెప్పేదో? కడుపులో దేవినట్లయింది. దుఃఖాన్ని ఆపుకోవడం సాధ్యంకాలేదు. చుట్టూచూస్తే చాలామంది ఏడుస్తున్నట్లున్నారు.

'పావం - ఎంత కష్టమచ్చిందో సచ్చిపోతాన్నది. ఎక్కడో నాటోళ్ళ ఆమెది దూరం జౌరల్నట వీళ్ళారు. గక్కడ్నుంచి, అడిది ఒక్కతి పొట్టకూటి కోసం. గిక్కడికి వచ్చుంది? వచ్చి బతుకలేక సచ్చేతందుకు మందు తాగుతేంది?' — బయట గుమిగూడిన వాళ్ళలో ఒక అవ్వ కళ్ళు తుడుచుకుంది.

'మొగడు లేడు. అవ్వలేదు. అయ్యలేడు. తోడబుట్టినోళ్లు లేరు. ఈ పాడుసావు పగోళ్ళగ్గూడ రావద్దు దేవుడా' — అంటూ కన్నీరు కార్చింది మరొక కన్నతల్లి.

'పాడు పనులు చెయ్యమన్నదెవడు? దిక్కులేని సావు సావుమన్నదెవడు? నూరేండ్ల విందుబతుకు బుగ్గిచేసుకునే తందుకా?'- అని ఆవేదన వ్యక్తం చేసింది మరొక స్త్రీ.

'ఆడిది, ఒంటరిది, గింతమంది మొగోళ్ళల్ల మంచిగెట్ల బతుకుతది? బతికినా ఈ మొగాళ్ల బతుకనిత్తర? - మరొకావిడ సమర్థించింది.

'దేవుడు సల్లనోడై ఆమె బతికేతె మంచిగుండు? - ఒక ముసలాయన చేతులు జోడించాడు.

అందరి మొగాల్లోనూ ఆందోళన, విచారం. వీళ్ళంతా విక్టోరియాతో ఏలాంటి సంబంధం లేని వాళ్ళు. వాళ్ళఆవేదనకుపునాదులు వాళ్ళమనస్సులే. ఆమెతో ఏదో ఒక విధంగా సంబంధం ఉన్నవాళ్ళెవరూ ఏడవడంలేదు. పల్లెత్తు మాట మాట్లాడడంలేదు. గాంభీర్యం చాటున తమ తప్పిదాలను, కుళ్ళు మనస్సులను దాచుకుని ఆప్తుల్లా పోజులు కొడుతున్నారు.

విక్టోరియాను తాలూకా ఆస్పత్రికి తీసుకుపోవడానికి నిర్ణయించారు బి.డి.వో.గారు. నేను, మరి ఇద్దరు ముగ్గురం కలిసి ఆమెను తీసుకువెళ్ళి జీబులో వెనక పడుకోబెట్టాము. దాయా రాజమ్మ ఆమె తలను తన వక్షంపై ఒరిగించుకుని కూర్చుంది. నేను, నారాయణ పక్కన కూర్చున్నాము. కాంపౌండరు, పి. ఏ. రామిరెడ్డి ముందు సీట్లో కూర్చున్నారు. బి.డి.వో గారు స్టీరింగు ముందు కూర్చున్నారు. జీబు స్టార్టయింది —

చైతన్య రహితంగా, జాలి గొలిపేలా పడిఉన్న విక్టోరియాను చూస్తూ కూర్చున్నాను. ఆమె మొగంలో జీవకళ క్షణ క్షణానికీ అంతరించిపోతున్నది. మొగం వికృతంగా మారుతున్నది.

నారాయణ రాత్రి జరిగిన సంగతులు చెబుతున్నాడు. అతడు ఏం చెబుతున్నాడో నాకు వినిపించనేలేదు.

విక్టోరియా కురూపి కాదు. ఆరోగ్యం ఉంది.

వయసు ఉంది. ఇరవై రెండేళ్ళు కూడ దాటాయో లేదో.

నా వయసు ఇరవైమూడు. నేనే ఆమెకన్నా ఒక సంవత్సరం పెద్ద. కాని ఆమె నాకన్నా ఎన్నో సంవత్సరాల పెద్దదానిలా కనిపిస్తున్నది. నేను అవివాహితుణ్ణే. ఆమె కూడ అవివాహితే. కాని ఆమె జీవితానికీ, నా జీవితానికీ ఎంతో భేదం. పోలికలు చూసుకోవడానికే వీలులేదు. అవివాహితునిగా నాకున్న విలువ ఈ సమాజంలో ఆమెకు లేదు. నాకు పరిచయంలేని, నేను ఊహించడాని క్కూడ భయపడేలాంటి భయంకరమైన అనుభవాలెన్నెన్నో గుదిబండల్లా ఆమె జీవితాన్ని ముంచి వేస్తూ వచ్చాయి. ఊబిలోకి కూరుకుపోతున్న కాలును బయటకు లాక్కోవడం ఆమెకు సాధ్యం కాలేదు తన జీవితంమీద తనకే అదుపు, అధికారం, స్వేచ్ఛ తప్పిపోయి కీలుబొమ్మలా, తోలుబొమ్మలా తయారయింది. వ్యక్తిత్వం చచ్చిపోయాక, ఆత్మ సంయమనం మంట గలిశాక, జీవితానందం ఎండమావుల్లో వడి కొట్టుకుపోయాక ఇక జీవితం ఎందుకు? — అందుకే ఆమె చచ్చిపోతున్నది.

చావడం సులభమే. కాని చచ్చిపోవడానికి సిద్ధపడడం సులభంకాదు. చచ్చిపోతూ అనుభవించే బాధకన్నా, చచ్చిపోవడానికి ప్రేరేపించిన బ్రతుకు బాధలే ఎక్కువ భయంకరమైనవి.

మూడు నెలల క్రింద నేనిక్కడికి వచ్చిన్నాదే విక్టోరియా పరిచయమయింది. టి. ఏ బిల్ కొరకు వచ్చింది ఆఫీసుకు. రెండు నెలల కింద సబ్‌మిట్ చేసిన బిల్స్ ఇంకా సాంక్షన్ కాలేదుట. ఒరిజినల్ బిల్స్ మిస్‌ప్లేస్ అయినాయంటే, మళ్ళీ సబ్‌మిట్ చేసిందిట. చేసి పదిహేను రోజులయిందట ఇంకా సాంక్షన్ కాలేదట.

కొత్తగావచ్చాననీ. రెండు మూడు రోజుల్లో ఆమె బిల్స్ సాంక్షన్ చేయించడానికి ప్రయత్నిస్తాననీ చెప్పాను.

'ఆడవాళ్ళను తమచుట్టూ తిప్పుకోవడం హీరోయిజం అనుకుంటారు మీ మొగవాళ్ళు.'- అంటూ నవ్వింది.

ఆమె నవ్వుతూ ఉంటే కంపరమెత్తింది ఎందుకనో. ఆడవాళ్ళు అందంగా నవ్వగలరు. ఆమె నవ్వు అందంగానేఉంది. కాని కృత్రిమంగా, అసందర్భంగా ఉన్నట్లు తోచింది. ఆ నవ్వు వెనుకవిందకుయుక్తి దాగి ఉన్నట్లు అనుమానం కలిగింది

ఆమె మళ్ళీ అంది - 'మీరైనా త్వరగా చేసి పెట్టండి బాబూ'

'చూస్తా నంటున్నానుగా.'

'ఎలా నమ్మేది? మీరూ మగవారేగా?'- ఆమె నవ్వింది మళ్ళీ.

ఇలాంటి నవ్వునవ్వే ఆడవాళ్ళ గురించి నాకో అభిప్రాయం ఉంది. ఆ అభిప్రాయమే విక్టోరియా మీదకూడ ఏర్పడింది అలా ఏర్పడడం చాలా సబబుగా, న్యాయంగా కన్పించిందికూడ.

అసహ్యంగా కోపంగా చూశాను ఆమెను.

విక్టోరియాతో నా పరిచయం, అంతటితో ఆగిపోతే ఆ అభిప్రాయం, ఆ అసహ్యం అలాగే ఉండేవి. ఆమెను అర్థంచేసుకోవడంలో అందరూ చేసినలాగానే నేనూ చేసిన తప్పు నా హృదయంలో వ్రణమై నిలచేవి. తప్పు సరిదిద్దుకోవడానికి నాకు అవకాశాలు లభించాయి. ఆ అవకాశాలను నేను మానవతతో వినియోగించుకున్నానని చెప్పలేను. అందుకొరకు సిగ్గు పడుతున్నాను.

విక్టోరియా తరచుగా ఆఫీసుకు వచ్చేది. నా కొలీగ్స్. ఎక్సెప్షన్ అఫీసర్లు అందరూ ఆమెతో చాలా ఫ్రీగా మాట్లాడేవారు. జోకులు విసిరేవారు. ఎత్తిపొడిచేవారు. అప్పుడప్పుడు ఆమెతో టీ త్రాగేవారు.

కాని, ఆమె వెళ్ళిపోయాక మాత్రం ఆమె గురించి చాలా నీచంగా, అసహ్యంగా, జుగుప్సాకరంగా మాట్లాడేవారు. ఆమె అంటే నాకు చిన్న చూపున్నా, వారి మాటలు దారుణంగా, అవివేకంగా, అన్యాయంగా ఉన్నట్లు ఫీలయ్యేవాణ్ణి. ఆమెముందు ఒక విధంగా, ఆమె వెనక మరొక విధంగా ప్రవర్తించే విభిన్నమైన వారి రెండు వ్యక్తిత్వాలు కొంతకాలం నేనర్థం చేసుకోలేకపోయాను. అలా వారి రెండు వ్యక్తిత్వాలు అర్థమయాకనే ఆమె అంటే సానుభూతి కలిగింది నాలో.

ఆమెమీద ఉండే అయిష్టంకన్నా, మా కొలీగ్స్ అంటే నాకున్న అసహ్యం కారణంగా ఆమెతో చాలా తక్కువగా మాటాడేవాణ్ణి. అందరి వాగుడు లాగే ఆమె నా మౌనాన్ని కూడా చాలా తేలికగా తీసుకునేది. దీనివల్ల నన్ను గేలిచేయడానికి వాళ్ళకు అవకాశం చిక్కేది. ఐతే ఆమెలో, ఆమెమాటలో, ఆమె నవ్వుల్లో లేని దుర్గంధం వారిలో, వారి మాటల్లో, వారి నవ్వులో నా కగుపించేది.

ఒకనాడు ఆమె అన్నది— "మీరు వచ్చిందగ్గర్నుంచి నా టి. ఏ. బిల్స్ రెగ్యులర్‌గా ఆలస్యం లేకుండా సాంక్షన్ అవుతున్నాయి."

మామూలుగా కృతజ్ఞతా పూర్వకంగా ఆమె ఆ మాట అన్నా, అతిశయోక్తి ఉన్నట్లు తోచి, నాకు కోపం వచ్చింది. కోపాన్ని అణచుకుంటూ ఇలా అన్నాను

'నేను ఎకౌంటెంటుని. నా పనే అది.'

ఆమె వెళ్ళిపోయాక యు.డి.సి.నవ్వాడు, నన్ను చూసి. అతని ముందు కూర్చుని గప్పాలు కొడుతున్న పి. ఏ శృతికలిపాడు.

వారి నవ్వులో పరిహాసం ఉంది మండిపోయింది నాకు. విక్టోరియామీది కోపం వారి మీదికి మళ్ళింది

'ఎందుకు నవ్వుతున్నారట్లా?'

నవ్వాపుకుని యు. డి. సి. అన్నాడు - 'ఆమె గురించి కాదు. వట్టిగనే ఎందుకు మీదేసుకుంటావు?

'దొంగ దొంగా అంటే భుజాలు తడుము కున్నట్లు' - అన్నాడు పి ఏ.


వాళ్ల నన్ను చూసే నవ్వారని రుఢీ చేసుకున్నాను. ఇంకా మరోమాట మాట్లాడకుండా ఊరుకున్నాను.

సాయంత్రం ఆఫీసునుండి వచ్చేస్తుంటే వెనక నుండి లోన్ ఇన్‌స్పెక్టర్ వచ్చి కలిశాడు. ఇద్దరం వెళ్ళి హోటల్లో కూర్చున్నాము.

టీ తాగుతూ అతనన్నాడు. 'అప్పుడు యు.డి.సీ, పి. ఏ. నవ్వింది నిన్ను చూసే.'

'నాకు తెలుసు. కాని ఎందుకు నవ్వారో అర్థం కాలేదు.'

'ఉద్యోగానికి కొత్త నువ్వు. మొదట అర్థం కాదేదీ. తర్వాతర్వాత అన్నీ అర్థమవుతాయి.



లంచాలు తీసుకోవడం, పేకాట ఆడటం, సీసాలు ఖాళీ చేయడం, కన్ను కొట్టి పైటల్ని లాగడం — ఇవి పురుష లక్షణాలు వాళ్ళ దృష్టిలో. ఇవి చేయని వాడు చేతకాని దద్దమ్మ అన్నమాట. వాళ్ళ నవ్వుకు మరో అర్థం కూడ ఉంది?"

"ఏమిటది?"

"విక్టోరియా నీకు కృతజ్ఞత చెప్పడం వాళ్ళు బేర్ చెయ్యలేక పోయారు."

"ఎందుకు?"

"జెలసీ వల్ల. జెలసీ ఎందుకంటావా - దీనికి కారణం విక్టోరియాయే?"

"నేను వచ్చి నెలకూడ కాలేదు. విక్టోరియా ఎటువంటిదో కూడ నాకు సరిగా తెలీదు. ఆమెతో సరిగా మాట్లాడనైనా మాట్లాడను కదా. మరి జెలసీ ఎందుకు?"

'అది అంతే బ్రదర్. విక్టోరియా జీవితం వీధి దీపం లాంటిది. చమురు పోయడానికి ఎవరూ ముందుకు రారు గాని, వెలుగు ననుభవించడానికి మాత్రం అందరూ హక్కుదారుల్లా తయారవుతారు. యూడీసీ కూడ అంతే. ఏ పని అతనికేం తీసిపోదు. ఆమెకు ఏ పనిగూడ సరిగా చేసిపెట్టడు సరిగదా, చుట్టూ తిప్పుకుని అధికారం చలాయిస్తాడు. మరి నువ్వు దీనికి భిన్నంగా ఆమెను నీ చుట్టూ తిప్పుకోకుండా, ఎప్పటివి అప్పుడు అన్ని బిల్సు సాంక్షన్ చేయిస్తున్నావుగా. వాళ్ళకు అనుమానం రాకుండా ఎలా ఉంటుంది? జెలసీ కలగకుండా ఎలా ఆగుతుంది?'

తర్వాత అతను విక్టోరియా గురించి కొన్ని విషయాలు చెప్పాడు ఆమె మీద లెక్కలేనన్ని కంప్లెయింట్సు ఉన్నాయట. ఈ సమితికి వచ్చిన రెండుసంవత్సరాలలోనే నాలుగుసార్లు ట్రాన్స్‌ఫర్ అయిందట. రెండుసార్లు ఎవార్షన్ చేసుకుందట. ఆమె గ్రామసేవిక కాబట్టి గ్రామాధికారులకు, గ్రామంలోని పెద్దమనుషులకు ప్రతి పూజ లేకుండా 'సేవ' చేయాలట. ఇంతకు ముందున్న బి డి వో బతే ఆమెను వదిలేవాడే కాదట......

ఈ సంగతులు నన్నేవిధంగా ప్రభావితం చేశాయంటే సరిగా చెప్పలేను.

కొన్నిరోజులు గడిచాయి.

ఆరోజు బాడ్‌మెంటన్ ఆడుకుని ఇంటికి వచ్చే సరికి సూర్యుడు పశ్చిమాద్రిని చేరుకుంటున్నాడు. బావిమీదకు వెళ్ళి స్నానంచేసి వచ్చాను. చీకటి పడుతున్నది. గాలి కదలడంలేదు. శరీరమంతా ఉడికిపోతున్నది. కుర్చీని వాకిట్లో వేసుక్కూర్చున్నాను బయట కొంచెం హాయిగా వుంది.

వీధిదీపాలు వెలిగాయి. ఎదురింటిముందు గద్దె మీద పిల్లలు ఆడుకుంటున్నారు. వాళ్ళలోని ఇద్దరాడపిల్లలకూ మెడలో మంగళ సూత్రాలున్నాయి. [illegible] పిల్లవయసు మూడు సంవత్సరాలు. రెండో పిల్లవయసు ఐదు సంవత్సరాలుంటాయి.

మా ఇంటి ఓనరు. ముసిలాయన జోగుతూ వచ్చాడు. లోపలికి వెళ్ళి ముసిలావిడ దుమ్ము దులుపుతున్నాడు.

చీకటి చిక్కబడింది. గాలి కదలడం ప్రారంభించింది. రేడియోలో తెలుగు వార్తలైపోయాయి. ఆడుకుంటున్న పిల్లలు అన్నం తినడానికి లోపలికి వెళ్ళారు.

అప్పుడు వచ్చింది విక్టోరియా.

చంకలో మడచిన గొడుగు ఉంది. చేతిలో లెదర్ బాగ్ ఉంది. తెల్లని చీర మాసిపోయింది. శరీరమంతా దుమ్ముతో నిండి, చమటలు కారుతున్నాయి. అలసిపోయిన గుర్తులు మొగంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆశ్చర్యపోయాను. భయపడ్డానుకూడ. ఆమె నా ఇంటికి రావడం అదే ప్రథమం.

వస్తూనే, 'గుడ్ నైట్' చెప్పింది నవ్వుతూ.

మంచినీళ్ళు తెచ్చిచ్చాను. నాలుగు గ్లాసుల నీళ్ల తాగింది. మరోకుర్చీ తీసుకువచ్చి వేశాను, కుర్చీని నాకు దగ్గరగా జరుపుకుని కూర్చుంది. నా భుజంపై నున్న తువ్వాలును లాక్కుని మొగం తుడుచుకుంది.

ఆకలిని కూడ లెక్కచేయకుండా కూర్చున్న నా ఏకాంతాన్ని ఆమె తనకు తానై వచ్చి భంగ పరచడం నా కిష్టంలేదు.

ఆమె అంది. 'పొద్దున రెండు మెతుకులు

**సత్యం**

సత్యాన్ని మించిన
వస్తువేమున్నది?
సత్య హీనమైన ప్రపంచం
భ్రష్టము, తుచ్ఛము
అయి పోతుంది.

—శరత్ చంద్రుడు

తికివెళ్ళాను. ఒకటే ఎండ. కుమ్ములో పెట్టినట్లు శరీరం ఉడికిపోయింది. ఛీఛీ - ఇంత పాడు ఉద్యోగం మరొకటుండదు రానైదుమైళ్ల పోనైదు మైళ్లు. మొత్తం పదిమైళ్ళదూరం, ఎండనకా, వాననకా, చలనకా టూర్లు చెయ్యాలి. ఊళ్ళలోని రాజ రాజ మహారాజశ్రీలను మెప్పించాలి. ఇంత కష్టపడ్డా మీరు, సారీ - మీరుకాదు, అకౌంటెంట్లు తిప్పుకుని, ఏడిపించి గాని బిల్స్ సాంక్షన్‌చెయ్యరు. లోటుకు ఎక్కడుందంటారు? ఆడదానైన నాలోనా? మగవాళ్ళైన మీలోనా?' తనకు సహజమైన ధోరణిలో నవ్వింది పకపకా.

నేను మాట్లాడలేదు.

'ఏం అలా ఉన్నారు? ఆఫీసులో రెండుమూడు మాటలైనా మాట్లాడేవారు. ఇప్పుడసలే మూగ నోము పట్టారు. తెలిసింది...' చిన్నగా నవ్వి అన్నది 'నేను రావడం మీ కిష్టంలేదు' అని మళ్ళీ నవ్వింది

కంగారుపడిపోయాను. 'అబ్బే. అదికాదు...'

'భోంచెయ్యలేదా ఇంకా?'

'లేదు ఇంకా వండుకోలేదు.'

'మీరికూడా స్వయంపాకమా మహానుభావా?'

'ఔను రెండు నెలలు హోటల్లో తిన్నాను. పదకొండు పౌండ్ల బరువు తగ్గిపోయింది. అందుకని మెదలుపెట్టాను.'

'బ్రహ్మచారులా మీరు?'

'ఔను.'

ఈ విషయం తనకు కొత్తగా తెలిసినట్లు ఆశ్చర్యపోయింది. ఈ రహస్యం తెలియడంవల్ల నా గురించి పూర్తిగా తెలిసిపోయినట్లు కళ్ళు పెద్దవి చేసింది.

'ఐతే మీధర ఎంత?'

ఆమె ప్రశ్న అర్థమయింది. కాని అది చాలా వాడిగా ఉంది గాలంముల్లులా. నాకొక మేనమామ వున్నాడు. ఆయన కొక కూతురుంది. ఆమెను చేసుకొమ్మని అమ్మా నాన్నా బలవంతం చేస్తున్నారు. కాని నాకు ఇష్టంలేదు. మేనరికం పేరు చెప్పివేసిన ఎర్ర ఓడిపోగా మామయ్య డబ్బును ఎరగా గాలానికిగుచ్చి విసిరాడు నాముందు. ఐదువేల నుండి ఎనిమిదివేలకు పెంచాడు నా ధరను. ఎరను మింగి గాలానికి తగులుకోవడానికి సిద్ధంగా లేను నేను.

— అది జ్ఞాపకం వచ్చింది

నేను జవాబు చెప్పేయుంటే అమె అంది.

'వేలకు వేలుపోసి బిడ్డలకు మొగుళ్ళను కొనిపెడతారు తండ్రులు. న్యాయం ప్రకారం డబ్బు పెట్టి తమను కొనుక్కున్న పెళ్ళాలకు బానిసలుగా ఉండాల మొగుళ్ళంతా. కాని జరుగుతున్నది దీనికి పూర్తిగా ఉల్టా.'

ఆశ్చర్యపోయాను. విక్టోరియా అర్థవంతంగా, అందంగా మాట్లాడగలదని అదివరకు నాకుతెలీదు.

తర్వాత ఆమె చాల కబుర్లు చెప్పింది. ఆమె మాటల్లో దాపరికం లేదు. కటినత్వం లేదు, నిజం ఉంది. వ్యంగ్యం ఉంది. హాస్యం ఉంది, అపారమైన జీవితానుభవం ఉంది. వీటితోపాటు కొంత విచారం ఉంది. మరికొంత విషాదం ఉంది. కాని అవి గర్భితం. నటన తెరచాటున దొర్లుతూన్న చీకటి గుంపు.

ఆమె మాటల్ని వింటూ ఆమె అంతరంగాన్ని చూడడానికి ప్రయత్నం చేశాను. పరిచయంఅయిన మొదటిరోజు ఆమె అన్న మాట జ్ఞాపకం వచ్చింది.

'ఆడవాళ్ళను తమచుట్టూ తిప్పుకోవడం హీరోయిజం అనుకుంటారు మీ మగవాళ్ళు.'

ఊరికే వెకిలిగా, ఎగతాళిగా, కించపరచే ఉద్దేశంతో ఆమె అలా అనలేదేమో ననిపించింది. ఆమె మాటలకు ఆధారం ఉండవచ్చు. అనుభవం నేర్పిన పాఠం తాలూకు పిలిస్తుందే ఆమె తాను మాట్లాడే ఒక్కొక్క మాటా మాట్లాడుతుందేమో. అదే నిజమని తోచింది నాకు.

పోతే మరో విషయంకూడ నా గ్రహింపుకు వచ్చింది. ఆమె మాటల్లో ఉన్న స్వాతంత్ర్యం. స్వేచ్ఛ ఆమె జీవితంలో లేవు! బయటకు కనిపించే స్వేచ్ఛ కనిపించని సంకెళ్ళ బరువుకు నిలువలేక నటనను ఆసరాగా పట్టుకున్నది!

ఆమెను అసహ్యించుకుంటున్నందుకు నొచ్చుకున్నాను. ఆమె ముందు బూటకపు అభిమానాన్ని అభినయిస్తున్నందుకు సిగ్గువేసింది ఆమె నసహ్యించుకునే అధికారం నాకు లేదు. ఉన్నట్లు అభి

వయించి నా హృదయానికి సిమెంటు పూత పూసు కోవడం నా ఆరోగ్యానికే మంచిది కాదు.

—— ఎనిమిది దాటింది...ఎనిమిదిన్న రయింది ...తొమ్మి దయింది.

ఆమె అన్నది - 'ఆకలి దంచేస్తున్నది నాకు. ఎన్నడూరాని అతిథిని వచ్చానన్న ధ్యాసైనా లేకుండా ఇంతసేపు ముచ్చట్లతో గడిపారు. మీ కుండవచ్చు గాని, నాకేం దాపరికం లేదు. అసలు దాచుకో వలసిందేమీ లేదు నాకు. ఏం - అలా చూస్తారు? పదండి లోపలికి, వంట వండుకుందాం.'

'మీరు వండుతారా? ఈ రాత్రా?'

'ఔను. అరగంటలో ఐపోతుంది. మా ఇంట్లో కూడ నే నొక్కదాన్నే. ఈ కొననుండి ఆ కొనకు నడవాలి. వండుకోవాలి. అదే వండడం ఇక్కడ మీ ఇంట్లో వండేస్తే ఇద్దరికడుపులూ నిండుతాయి. మీరు నాకు ఆతిథ్యం ఇచ్చినందుకు పుణ్యమూ దక్కుతుంది.'

ఈ మాటల్లో ఏదో అసాధారణమైంది ఉన్నట్లు తోచింది నాకు. ఆ ఆలోచనల నుండి తేరుకోక ముందే ఆమె అన్నది:

'మీ కిష్టమైతే ఈ రాత్రి ఇక్కడే ఉండి పోతాను.' - చూపులు సూటిగా, కాంక్షతో నిండి ఉన్నాయి.

వాటిని తట్టుకోలేక పోయాను. తలదించుకు న్నాను. మోసం లేదు. వంచన లేదు. వీటికి మారుగా ప్రేమ ఉంది. వాత్సల్యం ఉంది. కాని ఆమె అందే నాకా భావం లేదు. ఎలా మరి?

నా చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. రహస్యం చెబుతున్నట్టుగా అంది.

"నాకు మీరంటే చాలా ఇష్టం."

చాలాసేపు మౌనంగా ఉన్నాను. ఆమె కూడ ఏం మాట్లాడలేదు. చివరకు గొంతు పెగుల్చు కున్నాను. తలెత్తి ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాను.

"ఇలాంటి బ్రతుకు నీకసహ్యంగా లేదా?"

ఆమె అహం దెబ్బతిన్నట్లు కళ్ళు చెబు తున్నాయి. పొరలు కప్పిన మనస్సును గడ్డపారతో పెళ్లలకు పెళ్లలు పెకలించి వేసినప్పుడు కలిగే బాధ ఆమె మొగంలో స్పష్టంగా కనిపిస్తున్నది.

రెండు మూడు నిముషాల్లో ఆమె తనను తాను సంబాళించుకుంది. పాలిపోయిన పెదవుల పైకి నవ్వును తెచ్చుకుంటూ అడిగింది.

"మీరు రచయితా?"

ఉలిక్కిపడ్డాను - "అబ్బే...కాదు: కాదు..." తడబడ్డాను.

"కాని మీ మాటలు రచయిత మాటల్లానే ఉన్నాయి. మామూలు మగవాడు అలాంటి ప్రశ్న ఎన్నడూ అడగడు."

నా చేతిని విడిచిపెట్టి కుర్చీలో వెనక్కు వాలింది. ఎంతోసేపటికి ఆమె అన్నది.

"ఎన్నో సంవత్సరాల తర్వాత మళ్ళీ నేను పొరపాటు పడ్డాను. నన్ను క్షమించండి. మీరన్న మాట నింద కాకుండా ప్రశ్నే ఐతే, ఆ ప్రశ్నకు సరైన జవాబు చెప్పలేను" ఆమె కంఠంలో జవం, జీవం మాయమయ్యాయి. "ఆ ప్రశ్న అడగ గలిగిన మీరు దానికి సమాధానం కూడ ఊహించగలరు."

కళ్ళు మూసుకుంది. రెండు చేతులనూ తల కింద పెట్టుకుంది.

బాధ కలిగింది నాకు. జాలివేసింది. నోట మాట రాక చూస్తూ కూర్చున్నాను.

'ఎవరిని ఎన్నడూ ద్వేషించలేదు నేను. అలా చేసినట్లైతే నన్ను నేను ద్వేషించుకోవలసి వచ్చేది. నన్ను నేను అసహ్యించుకోవలసి వచ్చేది. ఎందు కంటారా - నాకు వ్యక్తిత్వం లేదు. స్వాతంత్ర్యం లేదు. నేను బానిసను. నాకు నేను బానిసను. ఈ సమాజానికి బానిసను. నేనాడదాన్ని. వయసు ఉంది. ఒంటరిదాన్ని. ఆ కొసన నెల్లూరులో ఒక అన్నయ్యతప్ప ఈ ప్రపంచంలో నాకెవరూ లేరు. అర్థమయిందనుకుంటా - అందుకే, ప్యూను, డ్రైవరు, గుమస్తా, ఎక్స్‌టెన్షన్ ఆఫీసరు, యూడీసీ, అకౌంటెంటు, బిడివో, ప్రెసిడెంటు, సర్పంచ్, పటేలు, పట్వారీలు - వీళ్ళంతా తమకు నామీద అధికారం, హక్కు ఉన్నాయనుకుంటారు. ఒకరు తమ హక్కును దొంగతనంగా చూపెడితే, మరొకరు దొరతనంగా చూపెడతారు. నా ఇష్టా యిష్టాలతో పనిలేదు. ఎదిరించి లాభంలేదు. ఎందు కంటే బతకాలిగనక. బతకాలిగలకే నన్ను నేను మరచి పోయాను. బతకాలిగనకే నెల్లూరునుండి ఇంతదూరంవచ్చాను. బతకాలిగనకే ఎదిరించడం, ఏడ్వడం మానివేశాను.'

కన్నీరు ఆమె మూసిఉన్న కళ్ళనుండి కార సాగింది. కొంతసేపు మౌనంగా ఉన్న తర్వాత మళ్ళీ మాట్లాడసాగింది.


'ఒకరి ముందు ఇలా కంట తడిపెట్టవలసి వస్తుందని నేననుకోలేదు. ఎవరితోనూ నా గురించి చెప్పుకోకూడదనుకున్నాను. ఎవరిముందూ నా దుఃఖాన్ని వెళ్ళబోసుకోకూడదనుకున్నాను. కాని మీరడిగిన ప్రశ్న నా పంతాన్ని విరగ్గొట్టింది. మీ ప్రశ్నలోని వాడి జ్ఞాపకాల అడుగున పడి పోయిన ఒక వ్యక్తిని పైకి లాక్కువచ్చింది. అత నికీ, మీకూ చాలా పోలికలున్నాయి. అతడుకూడ చాలా వాడిగా, వేడిగా మాట్లాడేవాడు. అతడు రచయిత. మీరుకూడ రచయితేమోనని అందుకనే అనుమానించాను. నేను పొర పాటుబడి ఉండవచ్చు. కాని నా ఊహ తప్పుకాదు. మీకు అభ్యంతరం లేకుంటే అతనిగురించి చెప్తా వినండి."

"చెప్పు —" అన్నాను ఏమి అనాలో తోచక.

"నేను ప్రైవేటుగా యస్. యస్. యల్. సి.కి కట్టి చదివేరోజుల్లో మా ఇంటిపక్కన ఒక రచ యిత ఉండేవాడు. ఇప్పుడాయన తెలుగులో పేరు మోసిన కథకుడు. పేరు చెప్పను గాని, ఇప్పుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు.

"అప్పుడు నాకు పదహారు దాటలేదు. మంచి, దయ, కరుణ, దేవుడు, భక్తి, సౌభ్రాతృత్వం, విశ్వాసం, స్నేహం, ప్రేమ- వీటిగురించి సున్నిత మైన, చాలా సుకుమారమైన అభిప్రాయాలుండేవి.

"ఒకరోజు అన్నయ్య ఆయనను మా ఇంటికి తీసుకువచ్చాడు. మా ఇద్దరికి పరిచయం చేశాడు. అంతకుముందు అతన్ని నేను చూస్తూనే ఉన్నాను. గాని, రచయిత అని తెలీదు. నేనాయన్ని చూసి చాలా అడ్మైర్ అయ్యాను. పాతిక సంవత్సరాలు వయసుంటుంది అతనికి. మంచి అందగాడు. ఆరోగ్యంగా ఉన్నాడు. అతని కళ్ళల్లోని కాంతి ఒక ప్రత్యేకతను కలిగివుండేది. అందంగా నవ్వ గలడు. అందంగా మాట్లాడగలడు. మీలాగే తక్కు వగా మాట్లాడేవాడు. మాట్లాడినప్పుడు మాత్రం చాలా నేర్పుతో, తన ప్రత్యేకమైన శైలిలో మాట్లాడేవాడు. అతని మౌనం అతని విలువను పెంచేది. అప్పటికి అతడు అవివాహితుడు. నాలో అతనిపట్ల ఆకర్షణ పెరగడానికి ఇదికూడ ఒక



కారణమే.

తరచుగా మాయింటికి వచ్చేవాడు. మా విషయాలు తెలుసుకునేవాడు. మాలో ఒకనిగా మెదిలేవాడు.

ఒకనాడు మీరడిగిన ప్రశ్నే అడిగాడు. 'విక్టోరియా, ఈ కూపస్థమండూకం బతుకు నీ కసహ్యంగా లేదా?' అని. ఆ ప్రశ్న కలిగించిన షాక్ నుండి తేరుకునేముందే నన్ను దగ్గరగా తీసుకుని కళ్ళల్లో కళ్ళుపెట్టి అనునయంగా అన్నాడు. 'విక్టోరియా, నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు నాకు కావాలి. ఈ లేమి, ఈ బాధలు ఎన్నాళ్ళని అనుభవిస్తావు? మనిద్దరం ఒకటవుదాం. బ్రతుక్కి ఒక క్రొత్తఅర్థాన్నిసృష్టించుకునిహాయిగాబ్రతుకుదాం.'

'నేనీ మాటలు నమ్మలేదు. ఎలా నమ్మను? అతనిలో సగం అందంకూడ నాకు లేదు. డబ్బు లేదు. ఇది రెండూఉన్న అతడు నన్నెలాప్రేమించ గలడు? అని అనుకున్నా. కాని రచయితగాఅతడు నన్ను నమ్మించాడు. సినిమాలో, నాటకంలో, కాశీ మజిలీ కథల్లో హీరో మాట్లాడినట్లు మాట్లాడాడు. పవిత్ర ప్రేమ గురించి, ప్రేమికుల హృదయౌన్నత్యం గురించి రోజులకు రోజులు చెప్పాడు.

'అంతవరకు అతనిమీద నా కెలాంటి దురాశ లేదు నా స్థితి నాకు తెలుసు. ఐతే అతని మాటలు నమ్మాను నా నమ్మకం ఎంతవరకు పోయిందంటే, 'నిన్ను పెళ్ళాడతానని' అత డన్నప్పుడు నేనేం ఆశ్చర్యపోలేదు, 'నన్నుగాక మరెవరిని పెళ్ళాడతాడేం?' అనుకున్నాను. దాదాపు సంవత్సరం ప్రేమమైకములో, కలలతో గడిచిపోయింది.

చివరి కొకనాడు చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయాడు. మళ్ళీ తిరిగిరాలేదు. తప్పకుండా వస్తాడనుకున్న నా నమ్మకం నాలుగు నెలలకు పోస్టులో ఆ...స్నయ్య పేరిటవచ్చిన వెడ్డింగ్‌కార్డు రెపరెపలకు కొట్టుకుపోయింది.

ఏడ్చాను. సంవత్సరంపాటు శారీరకంగా అతడు నన్ననుభవించాడనికాదు నా ఏడ్పు. నేను పతితనయ్యాననికూడ కాదు. అతనితోపాటు సమంగా నేను కూడ సుఖం అనుభవించాను. దానికొరకు ఏడవవలసిన అవసరమే లేదు. కాని ఏడ్చాను. ఎందుకో తెలియకుండానే ఏడ్చాను.'

'అతడు పేరుమోసిన కథకుడు. అన్యాయం, అవినీతి, మోసం, దగా, రాక్షసత్వాలకు వ్యతిరేకంగా చాలా ఆవేశంతో రాస్తాడు కథలు. అతని ప్రతికథలోనూ మానవత్వం, మంచి గెలుస్తాయి. అలాంటి పెద్దమనిషి నన్నెలా మోసగించగలిగాడో నాకు అంతు చిక్కలేదు. చిత్రమేమిటంటే అతన్ని కూడ ద్వేషించలేక పోయాను.

ఆమెకళ్ళు తెరచింది. కారినకన్నీరు చెంపలమీద ఇంకిపోతున్నది. కుర్చీలో సర్దుకుని కూర్చున్నది. ...నేపు మౌనంతర్వాత అన్నది మెల్లిగా.

'అతన్ని శీలవంతుడ్నిగా అర్థంచేసుకుని మోసపోయాను. మిమ్మల్ని శీలవంతుడ్నిగా అర్థం చేసుకోలేక మోసపోలేదు.' కొంచెంసేపు ఆగింది 'రచయితైనా, కాకపోయినా మీరు అతనిలా అవకండి. ఒకటిచెప్పి ఒకటి చేయకండి. లోపల ఒకరకంగా, బయట ఒకరకంగా ప్రవర్తించకండి. నాలోకూడ నటన ఉంది. నేనుకూడ నటిస్తాను. కానీ నా లోపలి కుళ్ళు, దుఃఖాన్ని కప్పిపుచ్చు కోవడానికి మాత్రమే నటిస్తున్నాను. నా నటన నా వరకే పరిమితం.'

నే నన్నాను ఆవేశంతో - 'విక్టోరియా నన్ను క్షమించు.'

ఆమె నవ్వింది. బేలిపోయి చూశాను. ఇంతకు ముందే ఏడ్చి, ఇప్పుడెలా నవ్వగలుగుతున్నదో!

'క్షమించడానికేముంది. మీరంటే నాకు ఇష్టం అని దాచుకోకుండా చెప్పేశాను. నేనంటే మీకిష్టం లేదని మీరు చెప్పలేక బాధపడుతున్నారు. అసలు మీరే నన్ను క్షమించాలి మీ ఏకాంతాన్ని భంగం చేశాను. వందుకోకుండా ఇంతసేపు నా గోడు చెప్పుకున్నాను. ఇప్పుడు పది అవుతున్నది. హోటళ్ళు మూసివేస్తారు. మీకిరాత్రి పస్తేయిక.'

తనకు అలవాటున్న మామూలు ధోరణిలో మళ్ళీ నవ్వింది. తర్వాత, "గుడ్‌నైట్' చెప్పి వెళ్ళిపోయింది.

పడుకున్నా నిద్ర రాలేదు నాకు. ఆమెను గురించిన ఆలోచనలు నిద్రను పారద్రోలాయి.

---

**వ్యధ**

తనకుతానై వ్యధ
సహింప నున్నవాడు
ఇతర్లను వ్యధ పెట్టలేడు.

— శరత్ చంద్రుడు

---

చివరకు ఎప్పుడో నాలుగు గంటల ప్రాంతంలో నిద్రపోయాను.

వారం రోజులక్రింద ఒక ఉదయం విక్టోరియా మళ్ళీ ఇంటికి వచ్చింది. పడకమీంచి ఇంకా లేవలేదు నేను. చల్లని ఉదయపు గాలి హాయిని కలిగిస్తున్నది. పిచ్చుకలు కిచకిచమంటూ పాట పాడుతున్నాయి. రేడియోలో సుప్రభాతం వినవస్తున్నది. వింటూ కళ్ళు మూసుకున్నాను.

"గుడ్‌మార్నింగ్ అబద్దాలరావ్" — అంటూ వచ్చింది.

కళ్ళు తెరిచి చూస్తే ఆమె.

సరాసరి వచ్చి నా పక్కన మంచంపై కూర్చుంది. నావైపు తలతిప్పి కోపాన్ని నటిస్తూ అన్నది. "ఆనాడు అబద్ధం ఎందుకు చెప్పావు?"

ఏకవచన ప్రయోగాన్ని గ్రహించాను. అందుకు నాకేం బాధ కలుగలేదు

"ఏ అబద్ధం?"

ఈ మాట అన్న తర్వాత తట్టింది ఏ అబద్ధమో

ఆమె పైట నా యెదపై ఆడుకుంటున్నది. ఆమె ముంగురులు నా శరీరానికి తాకుతున్నాయి. కాని నాలో ఏ వికారాలూ లేవు అసహ్యం కాని ఆవేశం కాని ఏమీ లేవు. నాకు ఇద్దరక్కలు ఒక చెల్లి. వాళ్ళలో ఎవరైనా నా పడకమీద కూర్చున్నప్పుడు ఎలా ఉంటుందో, విక్టోరియా కూర్చోవడంవల్ల కూడ అలాగే ఉంది.

'అవసరం లేకుండా అబద్ధా లెందుకాడతారో నా కర్థంకాదు. అబద్ధాలతోకూడ పబ్లిసిటీ చేసుకోవడం రచయితలకు చాతనయినంతగా మరెవరికీ చాతకాదు.'

'పబ్లిసిటీ గిట్టకనే కదా అబద్ధాలు చెప్పేది.'

'మరైతే ఫలానా పత్రికలో మీ కథ వచ్చినట్లు మీ లోన్ ఇన్‌స్పెక్టర్ భార్యకెలా తెలిసింది '

'ఈ ఊళ్ళో నాకున్న ఒకే ఒక స్నేహితుడు అతడు. అతనికి చెప్పాను అతడు భార్యకు చెప్పివుంటాడు.'

'అదేం కాదు. ఒక్కసారిగా అందరిదృష్టిలో నీ విలువను పెంచుకోవడానికి వేసిన ఎత్తిది.'

కళ్ళు మూసుకుని నేను మాట్లాడలేదు.

'కానీ నీ విలువ నా దృష్టిలో ఏమాత్రం పెరగలేదు?' ఆమె ఆగింది. అరనిముషం సేపు...

'తరగనూలేదు,' అంది.

నేను నవ్వాను.

'నువ్వు చాలా అందంగా నవ్వగలవు'- అంది.

'నవ్వించే వారుంటే.'

నా చెంపపై చిన్నది ఒకటి వేసింది.

'ఇంత పొద్దునలేచి ఇక్కడికి వచ్చింది నిన్ను నవ్వించడానిక్కాదు. అసలు రాత్రే రావాలనుకున్నాను. నీ కథ చదివి నే నాశ్చర్యపోయాను. ఆశ్చర్యం. నీ కథ పత్రికలో అచ్చయినందుక్కాదు. నువ్వు నాతో అబద్ధం చెప్పినందుకు.'

'అది సరే, మరి కథ ఎలా ఉంది?'

'నా రిమార్కు వినాలని ఉందా?'

'ఔను'

'చెప్పను.'

నవ్వాను.

'ఇంత శాంతంగా అందంగా నవ్వేవాడివి పాఠకుల హృదయాల్లో సుడిగాలివి. తుఫానును, విప్లవాన్ని, విధ్వంసాన్ని రగిల్చే కథ లెలా రాయగలిగావు?'

'నా ఆకాంక్షను వాస్తవానికి అనుగుణంగా మలిచాను. అంతే నేనుచేసింది.'

'కథలో నువ్వు చెప్పింది నిజమే. ఈ అబద్ధం నటన, బూటకపు విలువలు, న్యాయసూత్రాలు, పుస్తకాలు, సమాజం - అన్నీ విధ్వంసం కావాలి. తునాతునకలై పోవాలి. మండి మసైపోవాలి. ఇలా అనిపిస్తుంది నాక్కూడ. కాని ఇది అసంభవమేమో.'

'సంభవమేనని నా వాదన.'

'నాకుమాత్రం లేదు ఆ ఆశ.' నిరాశ నిండివుంది.

'ఒకటి చెబుతా, విను. ఉదాహరణగా నిన్ను తీసుకుందాం. బాధలు పడుతున్నావు. అవమానాలకు గురి అవుతున్నావు సంతోషంగా, మనిషిలా మర్యాదగా బతకడానికి వీలులేదు. దీనికికారణం ఈ సాంఘిక వ్యవస్థ అని నీకు తెలుసుకదా. ఇది మారాలని అనుకోవడంలో తప్పులేదు. ఐతే అనుకున్నంత మాత్రాన ఏదీ జరగదు. కార్యరంగంలోకి దుమకాలి. మార్పును తీసుకురావడానికి ప్రయత్నించాలి. పూర్తిమార్పు వచ్చేంతవరకు విశ్రమించవగూడదు. సుడిగాలి వీచినా, తుఫాను

రేగినా, విధ్వంసం జరిగినా పరవాలేదు. బిడ్డను కనాలంటే పురిటి నొప్పులు తప్పవు'

'పెద్దపర్వతంలాంటి ఈ సమాజాన్ని విధ్వంసం చేయడం కన్నా, తనకు తాను విధ్వంసం కావడం చాలా సులభంకదా!'

ఆమె కళ్ళలోకి గుచ్చి గుచ్చి చూశాను. ఆమె మాటల భావం అర్థమయింది ఐతే ఎందుకామాట లన్నదో నే నాలోచించలేదు. ఎందు కనవలసి వచ్చిందోకూడ నే నాలోచించలేదు.

నే నన్నాను - 'సమాజ విధ్వంసం అంటే మొత్తం మనుష్యుల వినాశనం కాదు. సమాజ సంపదను, ప్రకృతి సంపదను అధిక సంఖ్యాకులైన శ్రామికులనుండి వివిధ మార్గాలద్వారా లాక్కుని అనుభవిస్తూన్న పరాన్నభుక్కుల వినాశనమూ, మరియు వాళ్ళు తమ సంపదను కాపాడుకోవడానికి పీడితులను శాశ్వతంగా అణచి ఉంచడానికి ఏర్పరచుకున్న నీతి సూత్రాలూ, న్యాయ విధానమూ యొక్క వినాశనం అన్నమాట.'

— ఇలాసాగింది మా సంభాషణ. ఆమె చాలా సేపు ఉంది నా ఇంట్లో. ఇద్దరం కలిసి కాఫీ త్రాగాము. నవ్వుతూ వచ్చి, నవ్వుతూనే వెళ్ళి పోయింది.

తర్వాత మళ్ళీ ఆమెను చూడలేదు ఈ రోజు వరకూ. ఆమె యింతపని చేస్తుందని నే ననుకోలేదు. ఆమెను అర్థం చేసుకోవటంలో నా విఫలత ఇప్పుడు తెలిసి వస్తున్నది.

నారాయణ సర్పంచ్ రామన్నను తిడుతున్నాడు. ఎన్నడైనా ఒకనాడు తప్పకుండా ఆయన తలను టెంకాయ పగలగొట్టినట్లు పగలగొడతానని శపథం చేస్తున్నాడు

క్షణం క్షణం గడుస్తున్నది. జీబు తారురోడ్డును మింగివేస్తూ పరుగిడుతున్నది. విక్టోరియా మొగంలో మృత్యుఛాయలు గాఢమవుతున్నాయి. ఎంత ఆపుదా మనుకున్నా నా కళ్ళల్లో కన్నీరాగలేదు. ఏడవటమంటే నాకు అసహ్యం. కాని ఏడవకుండా ఉండలేకపోయాను

జీబు ఆగింది. చూస్తే కస్పిటి పొరల్లోంచి తెల్లని ఆస్పత్రి. అంపరం దిగాము. చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్న విక్టోరియాను లోపలికి తీసుకుపోయాము.

లాభం లేదన్నాడు డాక్టర్. పదిహేను నిమిషాలు గడిచాయి. చేయవలసిందల్లా చేసి, ఐపోయిందన్నాడు డాక్టర్.

విక్టోరియా చచ్చిపోయింది....

తర్వాత జరగవలసిందంతా జరిగిపోయింది. నెల్లూరులో ఉంటున్న ఆమె అన్నయ్యకు ఎక్స్ ప్రెస్ టెలిగ్రామ్ యిచ్చాము ఆ సాయంత్రమే. రాత్రి మాకెవరికీ నిద్రలేదు. ఉదయం మళ్ళీ టెలిగ్రాం యిచ్చాము నెల్లూరుకు.

మళ్ళీ సాయంత్ర మయింది. వాళ్ళన్నయ్య రాలేదు. విక్టోరియా క్రిష్టియన్ కావటం మూలాన స్థానికంగా వున్న చర్చి ఆధ్వర్యంలో, పోస్ట్ మార్టమ్ చేయబడ్డ ఆమె మృతదేహానికి అంత్యక్రియలు జరిగాయి. ఆ సాయంత్రమే ఊరికి తిరిగి వచ్చేసరికి రాత్రి పదకొండయింది.

మూడవనాడు వచ్చాడు విక్టోరియా అన్నయ్య. ఏడ్చాడు. ఆమెను తిట్టాడు. తనను తిట్టుకున్నాడు. దారిద్ర్యాన్ని తిట్టాడు దురదృష్టాన్ని తిట్టాడు. నాలుగు రోజులుండి ఆమె సామాను పోస్టాఫీసులో ఆమె దాచుకున్న ఆరువందల నలభై ఐదురూపాయలను, తీసుకుని వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు మా యింటికి వచ్చాడు.

సామాను సర్దుతూంటే, టేబుల్ సొరుగులో దొరికిందని, ఒక మడచిఉన్న చీటీ ఇచ్చాడు. తెరచి చదివాను. అక్షరాలద్వారా విక్టోరియా నాకు చెప్పిన చివరి వీడ్కోలు మాటలవి.

...రావ్,

వెళ్ళిపోతున్నాను. వెళ్ళిపోయేముందు నీతో మాట్లాడాలనుంది. అందుకని ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

నీతో పరిచయం నెగెటివ్‌గా పనిచేసి, నన్ను

(మిగతా 48వ పేజీలో)

# పాతఅచ్చులో కొత్తకథ

## నలుగురి మాటా వినాలి

ఆంధ్రుడు చేతిలో 'ఉక్కు-ఫ్యాక్టరీ' పథకం పట్టుకొని నడుస్తున్నాడు, అది పాడిఆవులాటిదని - దాన్ని సాధిస్తే తన దేశం సుభిక్షమవుతుందని ఏవో బంగారు కలలు కంటూ ముందుకు సాగుతున్నాడు.

దోవలో ఎవరో ఎదురువచ్చారు. 'నమస్తేజీ! ఏమిటి భద్రంగా పట్టుకెళ్తున్నారు. ఓ - ఉక్కు-ఫ్యాక్టరీయా ఎందుకుసాబ్ - ఫ్యాక్టరీ కట్టే వాతావరణం తమకులేదు. ఏవో ఆశలుపెట్టుకుని కట్టుకుంటే నష్టాలే వచ్చేది. ఉన్న అప్పులుచాలక అవికూడా ఎందుకు తోడుచేసుకుంటావు. వదిలెయ్ భాయ్."

ఆంధ్రుడు ఆలోచనలో పడ్డాడు. వదిలేద్దామా అనుకున్నాడు. కాని ఎవడో ఏదో అన్నమాట పాటించడం మంచిదికాదని ముందుకుసాగాడు. కొద్దిదూరం సాగేసరికి ఇంకెవరో ఎదురయ్యారు.

నమస్కారం! నమస్కారం! ఏదో సీరియస్‌గా ఆలోచిస్తున్నట్టున్నారే ఏమిటది' - ఉక్కు-ఫ్యాక్టరీయా అరే-నీ కెందుకు బ్రదర్ - అన్నపూర్ణలాటి నేల ఉండగా అందులో ఫ్యాక్టరీపొగ వదులుతానంటావు. దేశం పచ్చగా ఉండటం ఇష్టంలేదా ఏం-'

ఆంధ్రుడిలో ఆలోచన ఆవేదనగా మారింది. నాదేశం పరిశ్రమ పెడితే పొగ చూరిపోతుందా.

ముందుకుపడిన అడుగు మూడోవ్యక్తి ఆపడంతో ఆగిపోయింది.

'వణక్కం వణక్కం! ఎన్నజి - శీఘ్రంగా పోతున్నారు. అయ్యో అయ్యో - ఉక్కు-పరిశ్రమ - పెటబోతున్నారు - ఎన్న పైత్యకారి - నీ-గాంధీ సెప్పింది - కుటీర పరిశ్రమా అని - మగంనెయ్యామని - ఇది ఎందుకుసామీ - వదిలేయ్ -'

ఆంధ్రుడిలో ఆశ కొనఊపిరితో మిగిలి



పోయింది. ఇంతలో మరోఆంధ్రుడు ఎదురవటంతో విషయంచెప్పి సలహా అడిగాడు.

"మనకా - ఉక్కు-ఫ్యాక్టరీయా - నీకేమన్నా పిచ్చా - చాదస్తమా - పెడితే ఏ రాకెట్లతయారీయోపెట్టాలి. ఛఛ అది అవతలపారెయ్ - ముందు - అదికాదు - మనకు నదీజలాల సమస్యముఖ్యమా- ఇదా ఏమిటోయ్ - నువ్వుమరీను".




ఇటీవల కొన్నాళ్ళుగా సాహిత్య భవితవ్యాన్ని నవలా విభాగం నిరూపించినంతగా మరొకటి నిరూపించలేదనే సత్యం నిర్వివాదం. విభిన్న దృక్పథాల్ని ఆశ్రయించినా, అలంబనంచేసికొన్నా ప్రముఖంగా నవలా రచయితల్లో విశ్వనాథ - బాపిరాజు - గోపీచంద్ - రాచకొండ - తమ తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకున్నారు. ఒక భావంనుంచి మరొక భావం లోకి, ఒక దృక్పథంనుంచి మరొక దృక్పథం లోకి, ఒక కోణం నుంచి మరొక కోణం లోకి చొచ్చుకుపోతూ భావ సంఘర్షణలతో సతమతమవుతూ పరిష్కారమార్గ నిర్ణయంలో క్లిష్టసమస్యాన్ని సాధిస్తూ జీవితాంతం వేదనాజీవిగా, తాత్విక పరిశీలకుడుగా తన రచనల్లో సాక్షాత్కరిస్తాడు 'గోపీచంద్'.

"రచయితగా గోపీచంద్"

వెల : రు. 3/-

నవీనా పబ్లికేషన్స్, మెయిన్‌రోడ్, తెనాలి.

రాజారావుగారి పుస్తకానికి పీఠిక వ్రాస్తూ "శ్రీ సంజీవదేవ్" అన్నట్లు పుస్తకంలోని వెలుగు గోపీచంద్‌దా! రాజారావుగారిదా! అని ఆలోచించాలి. రాజారావుగారికి గోపీచంద్‌తో ఉన్న సాన్నిహిత్యం నిష్పక్షపాత విమర్శన నివ్వలేదనలేం.

స్థూలంగా గోపీచంద్ హేతువాద దృష్టినుంచి ఆధ్యాత్మిక గమ్యానికి ప్రస్థానం చేశాడు. జీవితమే సాహిత్యం చేసుకున్న అయన ప్రతి రచనలో పై విధానం కొట్టవచ్చినట్లు కనబడుతుంది. "అసమర్థుని జీవయాత్ర"లో సీతారామారావు, "మెరుపుల మరక"లలో 'ఉషారాణి' వంటిపాత్రలు గోపీచంద్ మానసిక సంఘర్షనని, క్రమపరిణతిని నిరూపిస్తాయి. "కర్మణ్యే వాధికారస్తే ..." అనే గీతాసారం ఆయనకు ఆదర్శమైంది.

ఏ రచయిత అయినా తన భావాల్ని రచనలలో వెళ్ళగ్రక్కడం కంటే, పరిశుద్ధదృష్టిని పరిశీలన చేయాలి. చక్కబడే సమాజాన్ని కల్పనలో ఉంచుకోవాలి. ఒక సామాన్య పాఠకుడు సమాజాదర్శాన్ని గ్రహించడానికీ, ప్రగతిని సాధించడానికి గోపీచంద్ రచనెంతవరకు దోహదకరించిందో వివరిస్తే మరింత బాగుండేది. ఏమైనా గోపీచంద్ తత్త్వ పరిశీలన కిదొక సాధనం. అవశ్యపఠనీయం.

—ఎస్. టి. పి. వి. ఆర్.

# ఇసుకదిబ్బ

(46 వ పేజీ తరువాయి)

...విహీనపరచింది. పెండోరాస్ బాక్స్‌లా మూసుకుపోయి ఉన్న నా అంతరంగాన్ని తెరిచావు. ఒక్కసారిగా ముసురుకున్న ఆలోచనలకు లొంగిపోవలసి వచ్చింది. నీ గురించి మొదలైన నా ఆలోచనలు అందరి చుట్టూ తిరిగి నా దగ్గరికే వచ్చి అంతంకాలేదు. నా గురించి నేను ఆలోచించడం నన్ను నేను అసహ్యించుకోవడానికి దారి తీసింది. బతుకు దుర్భరమయింది. ఈ స్థితిలో మనుష్యులు క్రూరంగా, భయంకరంగా, రాబందుల్లా, తోడేళ్ళలా, నక్కల్లా కనిపిస్తున్నారు.

ఎడారులెలా ఉంటాయో నేను చూడలేదు. ఊహించగలను. ఎటుచూసినా, ఎంతదూరం పోయినా ఇసుకే ఉంటుంది. చెట్లుండవు. నీళ్ళుండవు. వేడి ఉంటుంది. తాపం ఉంటుంది. గాలి వీస్తుంది కాని, మలయ మారుతం కాదు: నిప్పులు చెరిగే గాలి. ఆ గాలిలో నిప్పు రవ్వల్లా ఇసుక ఒక చోట లోయలు, మరో చోట మేటలు కుప్పలు. బయట ఆరిపోయినట్లు కనిపిస్తూ లోపల కణ కణ నిప్పులుండే కుంపటిలాంటి కుప్పలు. ఆ ఇసుక కుప్పలాంటిదే నా జీవితంకూడా.

మూడుసంవత్సరాల క్రిందట ట్రెయినింగయిం తర్వాత నన్ను ఈ జిల్లాకు అలాట్ చేశారు. ఇక్కడ నాకెవరూ తెలీదు. ఈ ప్రాంతం నాకు కొత్త. ఆర్డర్ పట్టుకుని జిల్లా పరిషత్ సెక్రటరీ దగ్గరకు వెళ్ళాను. ఆయన ఖాళీగా ఉన్నాడు. వయసు ఏభై ఏళ్ళుంటాయి. సంస్కారం, సభ్యత, నాగరికత, ఆయనలో కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. నా దరఖాస్తుచూసి, సాయంత్రం ఐదుగంటలకు రమ్మన్నాడు. హోటల్లో టిఫిన్ చేసి వచ్చి కూచున్నాను. అంతకుముందు రెండురోజుల నుంచి నిద్రలేదు. ప్రయాణంవల్ల వళ్ళంతా అలసిపోయి ఉంది. కొత్తకొత్తగా గుబులుపుట్టి మనసు మనసులోలేదు. ఐదుంపావయింది. సెక్రటరీ రూంలో ఆయనొక్కడే ఉండడంచూసి, లోపల వెళ్ళి నమస్కారం చేశాను.

ఆయన నన్ను గుర్తుపట్టాడు. కుర్చీ చూపి కూర్చుండమన్నాడు. వెనకా ముందు చేస్తే ... వంతం చేశాడు. నేను కూర్చున్నాక ఛేంబర్లో ... వెళ్ళి మొగం కడుక్కొని టాయిలెట్లై వచ్చా... చాలా తీపుగా మాట్లాడుతూ నా గురించీ చా... అడిగాడు. క్రమంగా ఆయన ముఖకవళిక... మాటల్లో మార్పులు వచ్చాయి. ఒక్కసారిగా జే... కిందినుంచి నా కాలుపై తన కాలువేశాడు. ఉలిక్కిపడి కాలును లాక్కునే లోపల ముందుకువంగి చేయిని అందుకున్నాడు. ఎలుగ్గొడ్డులా నవ్వు... సిగ్గూ దాపరికంలేకుండా అన్నాడు.

"రాత్రి ఇంటికిరా. రేపే అపాయింట్‌మెం... ఆర్డర్ ఇస్తా."

నిర్విణ్ణురాల్నయ్యాను. కణ కణం, నర నరం వజవజా వణికిపోయ్యాను. ముచ్చెమటలు పో... ఊపిరాడక ప్రాణాలు ఎగిరిపోతున్నట్లు ... పడ్డాను. ఆపుకున్నా ఆగకుండా ఏడ్పు ఎగుసు... వచ్చింది. బలవంతాన చేయి లాక్కొని ... గెత్తాను బయటకు. ప్యూను నన్ను చూసి ప... లించాడు. వెళ్ళి లాడ్జింగులో బెడ్‌పై వాలిపో... తనివితీరా ఏడ్చాను. చావాలనిపించింది. ... ఒక్కటే నా బాధలకు విముక్తిగా తోచింది.

కాని రావ్ - అప్పుడు నేను చావలేదు. బ... మీద తీపి. వెలుగు చూడగలనన్న ... నన్నాపని చేయనీయకుండా ఆపాయి. మరు... సెక్రటరీ పక్కలో పడుకుని, ఆర్డర్ తీసుకున్నా...

ఆత్మను చంపుకోవడం అదే ఆఖరు ... దన్న నా ఆశ ఈనాటికీ ఆశగానే ఉండిపోయి... నే నాడదాన్ని కావడమే ఇందు క్కారణం. ... నికి స్వాతంత్ర్యం వచ్చింది. స్త్రీలకు పురుష... పాటు సమానత వచ్చేసింది-అని అంతా చ... గుద్దుకుంటూ మొత్తుకుంటున్నారు. ఐతే రావ్, బ్రతుకు ఎందుకిలా బండబారిపోయింది?

ఆనాడు మూడేళ్ళకింద చావాలనుకుని ఇ... చచ్చిపోతున్నాను. ఈ చివరి ఘడియలో జ్ఞా... వచ్చింది నువ్వొక్కడివే. నిన్ను చూస్తూ మూయాలనుంది. కాని నిన్ను చూస్తే చచ్చిపోవాలనుకున్న నా తలంపే చచ్చిపోయి, మళ్ళీ ... మీద ఆశ కలుగుతుందేమో.

అందుకని పిలులేదు.

— విక్టో

Edited, Printed and Published by Maddukuri Chandrasekhara Rao, at Swatantra Art Printers, Vijayawada